# సాక్షి పల్నాడు

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024




## బగళాముఖి సేవలో జిల్లా జడ్జి

పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని గుంటూరు జిల్లా జడ్జి చింతాడ రాజగోపాల్ శనివారం దర్శించుకున్నారు.



## తిరుపతమ్మ తల్లి జ్యోతి ఊరేగింపు

దాచేపల్లి: శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి జ్యోతి ఊరేగింపు శనివారం నిర్వహించారు. మాలధారులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.



## కొవ్వొత్తులతో ప్రదక్షిణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై కొలువై ఉన్న కార్మెల్‌మాతను పదోతరగతి విద్యార్థులు శనివారం సందర్శించారు. కొవ్వొత్తులతో ప్రదక్షిణ చేశారు.



## న్యూస్‌రీల్

### నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని పల్నాడు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి శనివారం తెలిపారు. ఆదివారం నుంచి 20వ తేదీ వరకు పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్స్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు నియమించిందని వివరించారు. పరీక్ష కేంద్రాలలో ఏవైనా సమస్యలు తలెత్తితే కంట్రోల్‌రూమ్ 08647 223355కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

### 14న వైఎస్సార్ సీపీ బహిరంగ సభ

**లోక్‌సభ సమన్వయకర్త అనిల్ కుమార్‌యాదవ్ రాక**

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ లోక్‌సభ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈ నెల 14వ తేదీ నరసరావుపేట రాకను పురస్కరించుకొని పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా బీసీలకు కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలు, చిలకలూరిపేట ఇన్‌చార్జి కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. ఆ రోజున కాకాని, పెట్లూరివారిపాలెం గ్రామం దగ్గర నుంచి పల్నాడు బస్టాండ్ సెంటర్ వరకు భారీ బైకు ర్యాలీ, సాయంత్రం నాలుగు గంటలకు పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# కొండవీడు సంబరం ఆరంభం

- ఉత్సవాలు చరిత్రను చాటే వారధి కావాలి
- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఆకట్టుకున్న హెలిరైడ్
- తొలి రోజు భారీగా వచ్చిన పర్యాటకులు

యడ్లపాడు: కొండవీడు సంబరాలు అంబరాన్నంటాయి.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రకృతి అందాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొండవీడు ఫెస్ట్-2024 నిర్వహిస్తోంది. పకడ్బందీగా ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా హాజరైన జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ గొప్ప వారసత్వ సంపదను భావితరాలకు అందించే వారధి కొండవీడు ఫెస్ట్-2024 కావాలని ఆకాంక్షించారు. తొలుత జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఎఫ్ఓ ఎస్.రామచంద్రారావు, టూరిజం జిల్లా అధికారి బీజే బెన్నీ ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొని బెలూన్లు ఎగరేసి ఉత్సవాలను ప్రారంభించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలసి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యాం ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, మరో ఇద్దరు జాయింట్ కలెక్టర్లతో కలసి రెండు కొత్త పుస్తకాలను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన 6 విభాగాల స్టాల్స్‌తో పాటు హెలిరైడ్‌ను లాంఛనంగా జేసీ ప్రారంభించారు. ప్రారంభోత్సవ సందర్భంగా ఉదయం, సాయంత్రం నిర్వహించిన సమావేశాల్లో కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, జేసీ, ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు ప్రసంగించారు.



ఫ్లవర్ స్టాల్ వద్ద జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

కొండవీడు ప్రాశస్త్యం, వందేళ్లకు పైగా పరిపాలించిన అద్దంకి రెడ్డిరాజుల పాలనా వైభవాలను ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఉత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఇక్కడ సుందరమైన ఘాట్‌రోడ్డు, పురాతన కట్టడాలు, ప్రాచీన దేవాలయాలు, విలువైన, అరుదైన ఔషధ వృక్షాలు అనేకం ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలోనే కొండవీడు గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు నగర వనానికి ఖర్చు చేస్తోందని చెప్పారు. ఆయా నిధులతో ఇప్పటికే సందర్శకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను, పలు సాహస క్రీడలు, వారసత్వ సంపద, రక్షణ, నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



ఉత్సవాల ప్రారంభ సూచికగా బెలూన్లు ఎగరేస్తున్న జేసీ

**ఉత్సవాలలో ప్రత్యేకతలిలా...**

కొండవీడు ఉత్సవాలలో హెలిరైడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లలు, పెద్దలు కోట అందాలను ఆకాశం నుంచి వీక్షించేందుకు ఆసక్తి చూపారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. స్వాగత ద్వారం, నెమళ్లు, ఏనుగులు, కొంగలు, ఎద్దుల బండి, సైకిల్, కోనేరు నర్సరీ వంటి వాటిని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. తీర్చిదిద్దారు. పొద, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టులు వెరైటీ వంటకాలతో భోజన ప్రియులను స్వాగతించాయి.

**కళాకారులు, రచయితలు సందడి**

స్కూలు పిల్లలు, కళాశాలలు, కళాకారులు, జబర్దస్త్ టీం, పలువురు నాటకాల రచయితలు, ఉద్యోగులు ఆలపించిన ప్రత్యేక పాటలు, పద్యాలు, నృత్యాలు సందడి చేశాయి. కొండవీడు రాజ్యం, ఖిల్లా నమూనా సైకత శిల్పం చూపరుల మనసుల్ని ఇట్టే కట్టిపడేసింది. చారిత్రక అంశాలు తెలిపే గ్యాలరీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంపింగ్ తదితర ఆట వస్తువులు పిల్లలను ఆకట్టుకున్నాయి. వెదుళ్ల చెరువులో కయాకింగ్, పెడల్ బోటింగ్ వద్ద యువత బారులు దీరింది. మసీదు సమీపంలో ఆర్చరీ, గన్ షూటింగ్, తారాబురుజు వద్ద ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ వంటి సాహస క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొని సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఘాట్‌రోడ్డు ప్రారంభంలోనూ కొండపైన ప్రత్యేక వైద్య శిబిరాలను వైద్యశాఖ ఏర్పాటు చేసింది.

### ప్రవేశం ఉచితం

యడ్లపాడు: కొండవీడు ఉత్సవాలకు వచ్చే సందర్శకుల నిమిత్తం చెక్‌పోస్టు వద్ద ప్రవేశ రుసుం ఎత్తివేస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు.

**హెలిరైడ్ బుకింగ్ ఇలా..**

నరసరావుపేట: కొండవీడు ఫెస్ట్‌లో హెలిరైడ్‌కు సంబంధించి బుకింగ్ చేసుకునేందుకు మహేష్ 94003 99999, 74834 32752 నంబర్లను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెలిరైడ్ ట్రిప్‌కు పెద్దలకు రూ.4,500 పిల్లలకు రూ.4000 ఉండగా వాటిని తగ్గిస్తూ పెద్దలకు రూ.3,800 పిల్లలకు రూ.3,500గా ఖరారు చేశారు.

### జెడ్పీ నిధులు మంజూరు

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా కొండవీడుకోటలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కొండవీడు ఫెస్ట్-2024కు జెడ్పీ నిధుల నుంచి రూ.ఏడు లక్షలు అందించినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. ఆమె శనివారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. కోట అభివృద్ధి కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు నిధులు కేటాయించినట్లు చెప్పారు.

## మరియమాత దర్శనం.. సర్వపాప హరణం



ప్రార్థనలు చేస్తున్న బిషప్ విజయ్ కుమార్, బిషప్ రాజారావు తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): అమ్మా దర్శనం.. మరియమ్మా దర్శనం.. అంటూ భక్తుల శరణు ఘోషతో మేరీమాత పుణ్యక్షేత్రం మారుమోగింది. గుణదల క్షేత్రంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలకు అనేక రాష్ట్రాల నుంచి క్రీస్తు విశ్వాసులు లక్షలాదిగా తరలి వస్తున్నారు. ఏ దిక్కున చూసినా మరియమాత భక్తులే కనిపిస్తున్నారు. గుణదల మరియమాత ఉత్సవాల రెండో రోజైన శనివారం బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో జరిగిన సమష్టి దివ్యబలి పూజకు శ్రీకాకుళం మేత్రాసన బిషప్ రాయరాల విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు సందేశం ఇచ్చారు. లోక రక్షకుడైన ఏసు క్రీస్తును ఈ లోకానికి అందించిన మరియమాత పరమ పవిత్రురాలని కొనియాడారు. ఆమె పవిత్రతకు మెచ్చి సాక్షాత్తూ దేవాది దేవుడే మానవ రూపంలో జన్మించారని పేర్కొన్నారు. ఏసు నామంలో జీవిస్తున్న మనం మరియతల్లిని ఎల్లప్పుడూ మననం చేసుకోవాలని సూచించారు.

అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ ఫాదర్ సునీల్‌రాజు తదితర గురువులు, మఠకన్యలు, వేలాది మంది విశ్వాసులు పాల్గొన్నారు.

# ఆదరిస్తూ... ఆకలి తీరుస్తూ...

- పేదల కోసం జగనన్న ఉచిత భోజన క్యాంటీన్
- ప్రతి రోజూ వందలాది మందికి మేలు
- ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: జగనన్న ఉచిత భోజన క్యాంటీన్ నిత్యం వందలాది మంది పేదల ఆకలి తీరుస్తోంది. ఆకలితో ఏ ఒక్క పేదవాడు ఉండకూడదన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు క్యాంటీన్‌ను జనవరిలో ప్రారంభించారు. ఎంఆర్ ఫౌండేషన్ ద్వారా ఎప్పటి నుంచో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్, సుభాని నగర్ బోర్డు సమీపంలో క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఏదో మారుమూల ప్రాంతంలో నామ మాత్రంగా కాకుండా నిత్యం కార్మికులు, శ్రామికులతో కిటకిటలాడే ఈ సెంటర్‌లో ఉచిత భోజన క్యాంటీన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది.



క్యాంటీన్ ప్రారంభించి భోజనం వడ్డిస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు(ఫైల్)

**రుచిగా... శుచిగా ...**

ఉచిత భోజన క్యాంటీన్ అనగానే ఏదో మమ అనిపించకుండా ఇక్కడ రుచిగా... శుచిగా భోజనం అందిస్తున్నారు. ప్రతిరోజూ అన్నం, పప్పు, కూర, సాంబార్, చట్నీ, పెరుగుతో భోజనం అందజేస్తున్నారు. వందలాది మంది వస్తున్నా ఇబ్బంది తలెత్తకుండా సుభానినగర్ ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వంతులవారిగా సేవలు అందిస్తున్నారు.



జగనన్న ఉచిత భోజన క్యాంటీన్

### కడుపు నింపుతున్నారు..



నేను ముఠా కార్మికుడిని. పనుల కోసం ఉదయాన్ని ఇంటి నుంచి వస్తున్నా. భోజనానికి వెళ్లే సమయం ఎప్పుడు లభిస్తుందో తెలియదు. జగనన్న ఉచిత భోజన క్యాంటీన్ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ఇక్కడే భోజనం చేస్తున్నా. కడుపునిండా భోజనం పెడుతున్నారు.

–టి.విజయ్, ముఠా కార్మికుడు

### సేవ బాగుంది



జగనన్న ఉచిత భోజన క్యాంటీన్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇక్కడ నాలాంటి పేద వారు ఎందరో వచ్చి కడుపు నింపుకుంటున్నారు. ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దీనికి తోడు వైఎస్సార్ సీపీ నాయకులు సేవలు అందించడం ఆనందంగా ఉంది.

–కె.మరియమ్మ, వృద్ధురాలు

### స్వచ్ఛందంగా సేవలు



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు సేవా కార్యక్రమాలలో భాగంగా జగనన్న ఉచిత భోజన క్యాంటీన్ ఏర్పాటు చేశారు. మా వంతు సహాయంగా సుభానీనగర్ ప్రాంతానికి చెందిన మిత్రులు పఠాన్ సుభాని, మైక్‌సెట్ బుడే, అమానుల్లా, గుంటూరు బాజి, బాషా, అమీర్ తదితరులు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నాం.

–షేక్ షుకుర్

## ఖేలో ఇండియా విజేతకు స్పాన్సర్‌షిప్

- వెయిట్ లిఫ్టర్ ప్రేమసాగర్‌కు రూ.30 లక్షల స్పాన్సర్‌షిప్‌కు అంగీకారం
- ఐదేళ్లపాటు అందించనున్న రాధే గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్

చీరాల రూరల్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ అందుకున్న చీరాల వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు దేవరకొండ ప్రేమసాగర్‌కు అరుదైన అవకాశం దక్కింది. రాధే గ్రూప్ కన్‌స్ట్రక్షన్స్ ఆపన్నహస్తం అందించింది. ప్రేమసాగర్‌కు గ్రూప్ చైర్మన్ దగ్గుమళ్ల ప్రసాదరావు, మేనేజింగ్ డైరెక్టర్ రాధే ఐదేళ్లపాటు స్పాన్సర్‌షిప్ అందిస్తూ శనివారం అగ్రిమెంట్ చేసుకున్నట్లు ప్రేమసాగర్ తండ్రి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం ప్రేమసాగర్‌కు అవసరమైన క్రీడా పరికరాల కొనుగోలు, ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలు, విదేశాలలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ప్రయాణ ఖర్చులు, భోజనం, వసతి ఖర్చులు ఏడాదికి రూ. 5 లక్షలు, ఐదేళ్లకు రూ. 30 లక్షల వరకు ఖర్చు చేయనున్నట్లు ఆయన చెప్పారు. కోస్తా గిరిజన అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ దేవరకొండ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర సెక్రటరీ మల్లి అజయ్‌బాబు, గిరిజన విద్యార్థి రాష్ట్ర చైర్మన్, ప్రొఫెసర్ మల్లిభాస్కర్, ఏపీ గిరిజన ఎంప్లాయీస్ అసోసియేషన్ రైల్వే మల్లిభాస్కరరావులు వెయిట్‌లిఫ్టర్ ప్రేమసాగర్‌ను అభినందించి, రాధే గ్రూప్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.



అగ్రిమెంట్ పత్రం అందజేస్తున్న దృశ్యం



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 517.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 819.70 అడుగుల వద్ద ఉంది.

### నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.5000, గరిష్ఠ ధర రూ.6200, మోడల్ ధర రూ.5600 వరకు పలికింది.

# శాస్త్రీయ దృక్పథంతోనే మానవ మనుగడ

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- యడ్లపాడులో 24వ సైన్స్ సంబరాలు
- జేవీవీ, చెకుముకి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు


సభలో మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

**యడ్లపాడు:** సృష్టిలో జరిగే ప్రతి పరిణామానికి సైన్స్ అనుసంధానంగా ఉందని..రుజువుకు నిలబడనిది సైన్స్ కాజాలదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ ఎం గేయానంద్, విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో 34వ చెకుముకి సైన్స్ సంబరాలు, జాతీయస్థాయి సైన్స్ పోటీలు పల్నాడు జిల్లా యడ్లపాడులో శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే కార్యక్రమంలో తొలిరోజున అతిథులు జాతీయ, జేవీవీ పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ప్రారంభోత్సవ సమావేశంలో అతిథులు మాట్లాడుతూ మానవ మనుగడకు సైన్స్ దృక్పథం ఎంతో అవసరమని, నేడు ప్రతి రంగాన సైన్స్ మిళితం కావడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఇస్రో శాస్త్రవేత్తలు పి జగదీష్‌చంద్రారెడ్డి(గ్రూప్ డైరెక్టర్, బి.శ్రీనివాసరావు (ఎస్‌జీ విభాగం) మాట్లాడుతూ విద్యార్థికి మార్కులు, ర్యాంకులు ముఖ్యం కాదని, పరిశీలనా శక్తి, ప్రశ్నించేతత్వం పిల్లల్లో పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గ్రహించి ఆ దిశగా పిల్లల్ని నడిపించాలని కోరారు. ఏఎన్‌యూ ప్రొఫెసర్ ఏవీవీఎస్ స్వామి మాట్లాడుతూ కులమతాలు కాదు సైన్స్ అవసరం, పోటీతత్వం కాదు శాస్త్రీయ దృక్పథంతో ఎదగాలన్నారు. జేవీవీ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, కార్యదర్శి సీహెచ్ జయప్రకాష్ విజ్ఞాన శాస్త్రం పట్ల విద్యార్థులు ఆసక్తిని చూపాలని, మానవ జీవనశైలికి అది ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం ఇస్రో శాస్త్రవేత్తలతో విద్యార్థులు ముఖాముఖి నిర్వహించారు. శ్రీహరికోట నుంచి వచ్చిన వైజ్ఞానిక మొబైల్ బస్సును పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. అందులోని ఉపగ్రహ నమూనాలు, ప్రయోగాలు, అంతరిక్ష యాత్ర, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, చంద్రయాన్-3, రాడర్స్ పనితీరు తదితర విషయాలను శాస్త్రవేత్తలు విద్యార్థులకు వివరించారు. చివరిగా సైన్స్ క్విజ్, సైన్స్‌పై సామర్థ్య రాత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షులు డాక్టర్ దార్ల బుజ్జిబాబు, చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు సీహెచ్ సృజన, ఎం.వెంకటేశ్వరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పీపుల్స్ నెట్‌వర్క్ సభ్యులు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- నాల్గవ విడత ఆసరా చెక్కు అందజేత


డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

**వెల్దుర్తి:** పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మహిళలంతా అండగా నిలవాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వెల్దుర్తి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో జరిగిన వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీకను గుణంగా డ్వాక్రా రుణాలను నాలు గు విడతల్లో రద్దు చేసి అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక భారాన్ని తగ్గించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పుకోవడానికి ఏ ఒక్క పథకాన్నైనా పూర్తిగా అమలు చేశారాని నిలదీశారు. సీఎం జగన్ మహిళలకు ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళల రుణాన్ని పూర్తి రద్దు చేశారన్నారు. మండలంలో 640 గ్రూపుల్లోని 6404 రూ. 3.76 కోట్లు చెక్కును అక్క చెల్లెమ్మలకు చెల్లించారన్నారు. నాలుగు విడతల్లో రూ. 15.4 కోట్లను అందించటం జరిగిందన్నారు. మహిళా పక్షపాతి సీఎం జగన్ రానున్న ఎన్నికల్లో మహిళలు సీఎం జగన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తరువాత సీఎం జగన్ చిత్రపటానికి ప్రభుత్వ విప్ పీఆర్కే, డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలాభిషేకం చేశారు.

పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండా రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివ రామయ్య, మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల కోటిరెడ్డి, శిరిగిరిపాడు, కండ్లకుంట సొసైటీ అధ్యక్షులు గుంటక పెద చెన్నారెడ్డి, తాడికొండ పుల్లారెడ్డి, ఎంపీడీఓ నరసింహ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు కేతిరెడ్డి పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, పులుసు నారాయణ రెడ్డి, పిన్నెల్లి వెంకటరెడ్డి, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గురజాల జూనియర్ సివిల్ జడ్జి మృతి


షర్మిల (ఫైల్)

**గురజాల:** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి డి.షర్మిల శనివారం ఉదయం మృతిచెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. గత సంవత్సరం గురజాల కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. న్యాయమూర్తి షర్మిల మృతి పట్ల పలువురు న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు.

## బీసీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ముప్పాళ్ల:** మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ముప్పాళ్ల మండలం మాదలలో నిర్వహించబడుతున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి(స్టేట్ సిలబస్)లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థినులు 9 నుంచి 11 సంవత్సరాల వయస్సు మించి ఉండరాదన్నారు. 01-09-2013, 31-08-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు 9 నుంచి 13 సంవత్సరాల వయస్సు మించి ఉండరాదన్నారు. ప్రవేశ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్, లెక్కలు, పరిసరాల విజ్ఞానం(సైన్స్, సాంఘికశాస్త్రం)లలో 4వ తరగతి స్థాయిలో 2 గంటల వ్యవధిలో 50 మార్కులకు ఆబ్జెక్టివ్ టైపులో ఉంటుందన్నారు. మొత్తం 40 సీట్లు ఉన్నాయని, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

## ఎన్నికల సీఇవోకు జిల్లా సమాచారం

**నరసరావుపేట:** ఎన్నికల సమాయత్తంలో భాగంగా శనివారం రాష్ట్ర సీఇవో నిర్వహించిన సమీక్షకు కలెక్టర్ ఎల్.శివశంకర్ హాజరయ్యారు. అనంతరం జిల్లాకు చెందిన ఎన్నికల సంక్షిప్త సమాచారం అందజేశారు. ఎన్నికల సరళిపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు వారి వారి నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన ఎన్నికల ప్రక్రియ గురించి వివరించారు. నూతన యువ ఓటర్ కార్డులు, చనిపోయిన వారి ఓటర్ల వివరాలు, ఫాం 6, ఫాం 7,8 వివరాలు, తదితర ఓటర్ల వివరాలను ఎలక్షన్ సీఈవోకు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఏ.ఆర్.వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

## రేపూడిలో సీఎం సభాస్థలి పరిశీలన



**ఫిరంగిపురం:** మండలంలోని రేపూడి గ్రామశివారులో ఈనెల 15 నిర్వహించ తలపెట్టిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రానున్నారు. కాగా సభ నిర్వహించే స్థలాన్ని శనివారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు పరిశీలించారు. స్థలంలో పారిశుద్ధ్య మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలు, తాగునీటి సౌకర్యం, వాహనాలు నిలుపుదల చేసే విధానం గురించి అధికారులతో చర్చించారు. తీసుకోవల్సిన భద్రతా చర్యలు వివరించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ సభను అందరూ జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట డీఎల్‌డీవో సుజాత, ఆర్డీవో శ్రీకర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజారమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అపరిశుభ్రత, నీటి నిల్వతో దోమల బెడద

జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

**రాజుపాలెం:** ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరవని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. మండల కేంద్రంలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో ఆయన శనివారం ఇంటింటికీ తిరిగారు. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొన్ని రోజులుగా నిర్వాసిత కేంద్రంలో ఎక్కువ మందికి జ్వరాలు, ఒళ్లు నొప్పులు రావడంతో పీహెచ్‌సీ సిబ్బంది జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మంచి నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఇళ్ల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, తొట్లు, వాడని కుండల్లో నీరు నిల్వ ఉండటాన్ని మలేరియా అధికారి రత్నాకర్ గుర్తించారు. అపరిశుభ్రత, నీటి నిల్వ కారణంగా దోమల బెడద అధికంగా ఉందని, దీంతో జ్వరాలు వస్తున్నట్లు ఆయన తెలిపారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడవాపు వ్యాధులు వస్తాయని స్థానికులకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. జ్వరాలు వచ్చిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి, రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకట కృష్ణకుమార్, సత్తెనపల్లి సబ్ యూనిట్ పర్యవేక్షకుడు రోశయ్య, హెల్త్ సూపర్ వైజర్లు ఉన్నారు.